# ఆద్యంతాలు

కళ్ళు నులుముకొంటో మెట్లు దిగుతూనే తలెత్తి తుళ్ళిపడి నిలబడి పోయాను అచేతనంగా.

కోమలి ఓ పక్కకి ఒదిగి ఉంది, నాకు దారిచేస్తూ. దించిన తల ఎత్తలేదు. నావేపు చూడడానికి ప్రయత్నం చెయ్యలేదు. బంగారం రంగు చుక్కలచీరె, ఎర్రటి కెంపురవికెలోంచి ఆమె తెల్లటి వొళ్ళు ఝల్లుమనిపిస్తోంది. పెదవులు సిగ్గుతో, బిడియంతో కంపిస్తున్నాయి. నేనలాగే నిలబడి పోవడం చూసి గాభరా పడ్డట్టుంది. గ్రహించి ఎదురుగ్గా ఉన్న రాధాకృష్ణుల వేపు చూస్తూ –

"ఎప్పుడొచ్చావ్?" అన్నా.

"నిన్న ..." నూతిలో గొంతులా విన్పించింది. కాని ఆ కంఠంలోని మాధుర్యం ఎక్కడికి పోతుంది?

"అతను?"

"రాలేదు"

"ఉంటావా?"

"పండుగ వెళ్లేవరకూ"

"అమ్మకు కన్పించావా?"

"ఊఁ"

"మళ్ళీ కన్పిస్తావా – ఎప్పుడన్నా"

"ఏం?"

"జవాబు తెలీదా నీకు – సరే, అవసరమనిపిస్తేనే" అంటూ దిగిపోయాను. నేను స్నానం చేసి వచ్చేవరకూ ఆమె అలానే నిలబడి ఉండడం గమనించాను. మరింకేమీ చెప్పకుండానే మేడమీదికి వెళ్ళిపోయాను.

భోజనం చేస్తూండగా అమ్మ అన్నది.

"కోమలి వచ్చిందిరా – అత్తవారింటినుంచి"

తల ఒంచుకునే భోజనం చేస్తున్నాను.

"పాపం బాగా చిక్కిపోయింది"

"... ... ...."

"భర్త సరిగ్గా చూడటం లేదట – తెలుసా?"

"తెలీదు"

"నీకు కన్పించిందా?"

"ఊ" అన్నాను. ఇంకా ఏవేవో చెప్పుకుపోతోంది అమ్మ. కాని అవేవీ వినదల్చుకోలేదు నేను. నాకు సంబంధించని వ్యక్తి విషయాల్తో నాకేం సంబంధం?

మర్నాటి ఉదయం పళ్ళు తోముకుంటున్నాను, పెరట్లో గన్నేరు చెట్టు మొదటికి చేరబడి. అక్కణ్ణుంచి వాళ్ళ పెరడు బాగా కన్పిస్తుంది. అవతలి వేపు డిశెంబరు పువ్వు చెట్టుకి నీళ్ళు పోస్తోంది కోమలి. ఆరేళ్ళ గోపీ గొప్పు తవ్వుతున్నాడు. అక్కడికి వెళ్ళి నిలబడ్డా.

"బాగా చిక్కిపోయావట – అమ్మ చెప్పింది" అన్నా మెల్లగా.

తుళ్ళి పడింది కోమలి. పైట సవరించుకుని దూరంగా నిలబడ్డది.

"మీకు కన్పించటంలా?"

"ఏమో? – భర్తని "మీరు" అంటే చాలు. నన్ను "నువ్వు అను చాలు ఏం" మాట్లాడలేదు – ఏదో తెలియని ఆందోళన పడుతోంది కోమలి.

"ఎవరైనా చూస్తారని భయమా?"

"కాదు" – మెల్లగా అంది

"భర్త సరిగ్గా చూడటం లేదట – నిజమా?"

ఆమె చటుక్కున ముఖం ఎత్తింది. ఆ ముఖంలో ఎంత ఆశ్చర్యం ద్యోతకమయిందో చెప్పలేను.

"అమ్మ అన్నది"

"ఆ ప్రశ్న నువ్వు అడక్కూడదు –" అంది తలఒంచుకునే.

"సరే" అని వచ్చేశాను.

ఒకటి మాత్రం తెల్సింది. నా నుంచి దూరంగా ఉండాలని కోరుతోంది కోమలి. మాట్లాడడానికి – తర్వాత – ఇంకే ప్రయత్నమూ చెయ్యలేదు నేను.

ఆరేళ్ళ క్రిందటి ఒకనాటి అర్ధరాత్రి ఆ గన్నేరు చెట్టు నీడలోనే కూర్చొన్నాం ఇద్దరమూను.

ఆమె నా ప్రక్కన ఉంది. ఆమె చెయ్యి నా చేతిలో.

"నీకు పెళ్ళి ప్రయత్నాలు చెయ్యబోతున్నారటగా?"

"అలా అనే విన్నాను"

"ఇష్టపడ్డావా?"

"ఏం చేయమంటావ్?"

"వద్దను"

"అన్నాక?"

నేను జవాబు చెప్పలేకపోయాను. ఆ ప్రశ్నకు ఎంత బరువు ఉందని? – తన జీవితాన్ని ఏం చేయమంటావన్న ప్రశ్నకు ఏమని చెప్పేది? – అప్పుడింకా మా నాన్నగారి చేతుల్లోనే ఉన్నాను.

"అయితే ఒప్పుకుంటావన్నమాట"

"తప్పకుండా"–స్నిగ్ధంగా ఉంది. ఆ కంఠంలోంచి ఏదో బాధ వినిపిస్తూనే ఉంది.

"ఎందుకింత తెగిస్తున్నావ్?"

మాట్లాడలేదు. అప్పుడే జారిన పువ్వుని చేతిలోకి తీసుకొంది.

"నన్ను ప్రేమించడంలేదా?"

"మళ్ళీ నా నోటంట వినాలని ఉందా?"

"పోనీ, మరోసారి"

"ప్రేమించానని అంటే?"

"చాలు. తృప్తి"

"అంతేనా?"

"మరి?"

"నేను నీ దాన్ని కానక్కర్లేదా?"

"ఎలా?"

"ఎక్కడికన్నా పారిపోదాం–"

తుళ్ళిపడ్డాను. "అంత పని...."

"ధైర్యం లేదా?"

మాట్లాడలేదు నేను.

నా ఒళ్ళో తల పెట్టుకుని ఏడ్చింది కోమలి. "ఎక్కడికీ పోనియ్యను నిన్ను. నువ్వూ, నీ శరీరం, నీ జీవితం నాది" అని గట్టిగా గుండెకు అదుముకున్నాను ఆమెను.

దూరంగా అరిచిన కోయిలా, దగ్గర్లో రొద చేసిన పిల్లగాలీ మాకు సాక్ష్యం.

* * * * *

మరో ఆరు నెలలకి కోమలికి పెళ్ళయి పోయింది.

ఆమెకు నా మీద నమ్మకం నశించింది. నేను అసహాయుణ్ణి, అసమర్థుణ్ణీ అని తెలుసుకొంది. ఇంకెవర్నో పెళ్ళి చేసుకుంది.

మర్నాడు పెళ్ళనగా నా గదిలోకి వచ్చింది. ఏడ్చినట్టు నా కళ్ళే చెప్తున్నాయి. అయినా గంభీరంగా కూర్చొన్నాను.

ముఖం నిండా పసుపూ, మెడలో బంగారు నెక్లెసూ, ఆనాడే తలకు స్నానం చేసినట్టుంది. కురులన్నీ లేచి గాలికి ఆడుతున్నాయి. ఆమె పెదవుల్ని చూశాను, వణుకుతున్నాయి. చెక్కిళ్ళు తెల్లబడ్డాయి. కాని ఆ కళ్ళను చూసే ధైర్యం నాకు లేదు.

"నీ కాళ్ళకు దండం పెట్టడానికి వచ్చా నివాళ" అంది మెల్లగా.

నా గుండె పగిలి పోయింది.

"నీకున్న పాటి సౌహార్ద్రం, మంచితనం ఆయనకు కలగాలని దీవించు" అంది వంగి నమస్కారం చేస్తూ.

మనస్సులో ఏమనుకున్నానో ఏమిటో, తలమీద చెయ్యి వేస్తూంటే కన్నీటి చుక్కలు టపటపా రాలాయి.

* * * * *

ఇన్నాళ్ళ తర్వాత మళ్ళీ ఇవాళ కోమలి ముందు నిలబడితే నేనెంతో చిన్నవాడి ననిపించింది. కొడుకు పుట్టి చచ్చిపోవడం, క్షయతో బాధపడ్డ భర్తకి రాత్రింబవళ్ళు సేవలు చేయడం, అత్తగారిని చనిపోయేవరకూ సాకటం – ఇన్ని చూసింది కోమలి. కాని నేనింకా మేడమీద నాగదిలో తండ్రిగారి అజమాయిషీలో అరమోడ్పు కన్నులతోటే ఉన్నాను.

పెద్దదయినట్టనిపించింది నాకు. కళ్ళు కాస్త లోతుకి పోయాయి. శరీరంలో ఇంకా మెరుపు తగ్గలేదు. పువ్వు తొడిగిన లతలా ఉంది.

వెళ్ళిపోయే రోజున మళ్ళీ ఓసారి కన్పించింది.

"అప్పటి నా దీవన ఫలించిందా?"

"ఏది?"

"నీ భర్త నాలాగా...."

"ఊ"

"పోనీ"

"ఇంకేమీ అడగాలని లేదా?"

"ఏమి అడిగేది?"

ఆమె కళ్ళలో నీళ్లు సుడులు తిరిగాయి.

"ఎప్పుడన్నా పాత విషయాల్ని తల్చుకు ఏడుస్తావా – అని అడుగు"

"అడిగితే?"

"గుండె పగిలేట్టు – అంటాను"

"అందువల్ల నాకేం లాభం?"

విచిత్రంగా నా ముఖంలోకి చూసింది.

"ఎంత మారిపోయావ్ నువ్వు?"

"కాలం అలాంటిది"

"అంతేనా?"

"నా మార్పుల్ని సరిదిద్దేందుకు నువ్వు లేవు"

"ఇంకా?"

"నువ్వు లేవనే బాధ"

"నిజంగా ఉందా?"

"ఉందేమో? – లేకపోతే ఇలా నిర్లిప్తంగా ఎలా ఉండిపోతాను? రాత్రి పగలూ ఇదే ఆలోచన"

క్షణకాలం మాట్లాడలేదు కోమలి.

"మరి నే వచ్చేదా!"

"నిజంగా ఆ ప్రశ్న నన్నడగాలా? – దాని జవాబు సిద్ధం చేసుకునే వచ్చావ్ నువ్వు"

"సూటిగా మాట్లాడలేవా నువ్వు?"

"క్షేమంగా వెళ్ళిరా – సరా?"

ముఖం కప్పుకొని ఏడుస్తూ వెళ్ళిపోయింది కోమలి.

మరో ఆరునెలలకీ తిరిగి వచ్చింది – భర్త పోయాడని – అమ్మ చెప్పగా విన్నాను.

ఎప్పుడన్నా గన్నేరు చెట్టు నీడలో నిలబడితే కోమలి కనిపిస్తుంది. గాలిలో రెప రెపలాడే ఆకులా, మోడువోయిన వృక్షంలా –

జీవితంలో మొదలు, తుదీ చూసిన కోమలి –

నా జీవితానికింకా మొదలే లేదు?

---